

మంగళవారం మకర సంక్రాంతి

# ముచ్చటైన సంక్రాంతి

**శ్రమైక జీవన సౌందర్యానికి, సామాజిక సమైక్య మాధుర్యానికి ప్రతీక సంక్రాంతి. సర్వజన హితాన్ని ఆకాంక్షిస్తూ, సమష్టి తత్వాన్ని ప్రతిబింబిస్తుంది ఈ పండుగ. తెలుగు లోగిళ్లను వెలుగు వాకిళ్లుగా మార్చే ముచ్చటైన, ముగ్ధమనోహరమైన మూడు పండుగల సమాహారంగా సంక్రాంతి సౌందర్యం వెల్లివిరుస్తుంది. ఎన్నో ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులు, వైజ్ఞానికపరమైన అంశాలు ఈ వేడుకలో దాగి ఉన్నాయి.**

HAPPY Makar SANKRANTI

సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన రోజే సంక్రాంతి. 'వచ్చింది వచ్చింది పచ్చ సంక్రాంతి... వచ్చింది వచ్చింది లచ్చి సంక్రాంతి...' అంటూ గ్రామీణులు అమితోత్సాహంతో ఈ పండుగ రోజుల్లో పాడుకుంటారు. బొమ్మల పండుగ, ముగ్గుల పండుగ, పంటల పండుగ, పశువుల పండుగ, పెద్దల పండుగ, పెద్ద పండుగ... ఇలా సంక్రాంతికి ఎన్నో పేర్లు. వీటన్నిటికన్నా సంక్రాంతి అనగానే మనకు గుర్తుకు వచ్చేవి ప్రతి ఇంటి ముంగిటా మెరిసిపోయే ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల భజనలు, గంగిరెద్దుల ఆటలు, భోగిమంటలు, అరిసెలు, బొమ్మల కొలువు.

### ప్రకృతి మార్పులకు సంకేతం

సంక్రాంతి పుష్యమాసంలో వస్తుంది. వరుస ప్రకారం పుష్యమాసం సంవత్సరంలో పదో మాసం. ఈ నెలలో పూసగుచ్చడానికి కూడా పొద్దు ఉండదని నానుడి. చల్ల చల్లని గాలులు మేనును స్పృశించడం, మంచుజల్లులు పుడమిని ముద్దాడటం... ఇవన్నీ పుష్య సోయగాలే. పుష్య అంటే పోషణ శక్తి కలదని అర్థం. పుష్య పూర్ణిమ నాటి రాత్రి సిద్ధాంతులు దూదిని మంచులో ముంచి ఆ మర్నాడు దాన్ని పిండి ఆ ప్రక్రియలో వచ్చిన నీటి చినుకుల్ని బట్టి వర్ష నిర్ణయం చేసేవారని చెబుతారు. ఎన్ని చుక్కలు జారిపడితే అన్ని కుంచాల వాన కురుస్తుందని అంచనా వేసేవారు. ప్రాచీన కాలంలో ప్రకృతి పరిశీలన ద్వారా మనిషి సాధించిన వైజ్ఞానిక ప్రగతికి ఇది ప్రతీకగా కనిపిస్తుంది. సంక్రాంతి అంటే 'చేరుట' అని అర్థం కూడా ఉంది. సంక్రమణంలో భాగంగా పుష్య మాసంలో సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. ఆ పర్వకాలమే సంక్రాంతి. ఇది మూడు రోజుల పర్వం. పంట



చేతికి అందటం వల్ల రైతులు ఆనందోత్సాహాలతో గడిపే సమయం ఇది. తమకు పాడిపంటలనిచ్చిన పండుగగా రైతులు సంక్రాంతిని కృతజ్ఞతా పూర్వకంగా జరుపుకొంటారు. పంటను చేతికిచ్చిన భగవంతుడికి, పొలాల్ని దున్నే ఎద్దులకు ఈ పండుగ ద్వారా ధన్యవాదాలు తెలుపుతారు. భోగి, సంక్రాంతి, కనుమ పర్వాల్లోని అంతరార్థం ఇదే.

### భోగిమంటల సందడి

సంక్రాంతికి ఒక రోజు ముందు భోగి పండుగతో సంబురాలు మొదలవుతాయి. భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజు అని అర్థం. పాడి పంటలు సమృద్ధిగా ఇళ్లకు వచ్చే సమయం కావటంతో రైతులు ఎంతో ఆనందంగా ఉంటారు. ఈ రోజు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి అభ్యంగన స్నానం చేసి, ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేస్తారు. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ భోగి మంటల్లో పనికిరాని దుస్తులు, వస్తువులను వేసి పీడలను, అరిష్టాలను తొలగించుకుంటారు. భోగి పండుగ రోజు ఉదయం పిల్లలకు స్నానాలు చేయించి కొత్తదుస్తులు వేసి వారిని తూర్పు వైపునకు కూర్చోబెట్టి రేగుపళ్లు, చిల్లర నాణేలను కలిపి వారి తలపై పోస్తారు. తర్వాత పిల్లలకు హారతి ఇస్తారు. ఇలా చేయడం ద్వారా వారిపై పడిన దిష్టి తొలగిపోతుందని భావిస్తారు. అంతేకాకుండా పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతుంది. బాహ్య నేత్రాలకు కనిపించని బ్రహ్మరంధ్రం తలపై భాగంలో ఉంటుంది. భోగిపళ్లను తలపై పోయడం ద్వారా అవి బ్రహ్మ రంధ్రాన్ని ప్రేరేపిస్తాయి. తద్వారా పిల్లల బుద్ధి వికసిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

### సంబురాల పండుగ

మకర సంక్రాంతి విశేష పర్వదినం. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే ఈ పుణ్యదినాన సూర్యునికి అర్ఘ్యాలు ఇవ్వడం, పూజలు చేయడం, దానధర్మాలు చేయడం పరిపాటి. కాల గమనం దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తున్నందున శరీరానికి సమతౌల్యం అవసరం. ఇందుకోసం నువ్వులు కలిపిన చక్కెరను తినడం, బెల్లంతో కలగలిపి చేసిన నువ్వుల లడ్డూలను తినడం కనబడుతుంది. పండుగ రోజున నెయ్యిని, కంబళ్లనూ, బెల్లాన్నీ, దానం ఇవ్వడం, ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులను వేయడం సంప్రదాయంగా వస్తున్నది. సూర్యుడి రథాన్ని ముగ్గుగా వేసి, దానిపై పేడతో చేసిన గొబ్బెమ్మలను, నువ్వులు, బియ్యం, చెరుకుగడలను ఉంచడం ప్రతి ఇంటి వాకిటా కనబడుతుంది.

మకర సంక్రాంతి సూర్యుణ్ని ఉద్దేశించి చేసే మహా పర్వదినం. సూర్యుడు మానవ ప్రపంచానికి నేత్రం వంటి వాడు. అతను లేకుంటే ప్రపంచానికి వెలుగు ఉండదు. సూర్యుడే మానవాళికి ఆరోగ్య ప్రదాత. సూర్యకాంతి వల్లే ప్రకృతి వికసిస్తుంది. సౌందర్యాన్ని ఆవిష్కరిస్తుంది. మేఘాలు ఏర్పడతాయి. వర్షాలు కురుస్తాయి. పంటలు పండుతాయి. చెట్లు పెరుగుతాయి. మానవుల జఠరాగ్ని ఆరిపోకుండా ఉంటుంది. శరీర అవయవాలన్నీ చక్కగా పనిచేస్తాయి. ఈ విధంగా మకర సంక్రాంతి ఆరోగ్య కారకమైన పండుగగా కూడా విరాజిల్లుతున్నది.

“
**ఆనందాల కనుము**

**సంక్రాంతి** మరుసటి రోజు కనుము. ఇది రైతులకు ఎంతో ముఖ్యమైన పర్వదినం. వ్యవసాయమే ఆధారమైన మన దేశంలో ఈ కనుము నాడు వ్యవసాయ పరికరాలను చక్కగా అలంకరించడం, పశుసంపదకు పూజలు చేయడం, ఎడ్లబండ్లను రంగురంగుల కాగితాలతో అలంకరించడం, పూజించడం కనబడుతుంది. ఈ పర్వదినం రోజు వ్యవసాయదారులందరూ తమ ఇళ్లల్లో చక్కగా పూజలు నిర్వహించుకొని, ఎడ్లబండ్లపై గ్రామవీధులలో ఊరేగుతారు. ప్రధానకూడళ్లలో ఎడ్లబండ్లను ప్రదర్శనగా ఉంచడం పరిపాటి.
”

... డా|| కప్పగంతు రామకృష్ణ

# కొలని దోపరికి గొబ్బిళ్లో..!

**తెలుగు వారికి సంక్రాంతి మూడు రోజుల పండుగ. భోగి, సంక్రాంతి, కనుమ. సంక్రాంతి సందడి భోగి నుంచే మొదలవుతుంది. ఈ రోజున సూర్యోదయ సమయంలో ఇంటిముందు కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేస్తారు. వీటి మధ్యలో, ఇంటి ద్వారాల రెండు వైపులా ఆవు పేడతో చేసిన ముద్దలను వివిధ రకాల పువ్వులతో అలంకరించి పెడతారు. వీటినే గొబ్బెమ్మలు అంటారు. గొబ్బెమ్మ అనే పదం గోపెమ్మ నుంచి వచ్చిందని అంటారు. అంటే ఇది కృష్ణభక్తి సంప్రదాయానికి సంబంధించింది అన్నమాట. ఇప్పుడు అసలే కనిపించదు కానీ, ఒకప్పుడు బాలికలు ఈ గొబ్బెమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయాకారంగా తిరుగుతూ గొబ్బి పదాలను ఆలపించేవాళ్లు.**

తెలుగు లోగిళ్లలో గొబ్బెమ్మలను ఉంచడం దాదాపు ఎనిమిది వందల ఏండ్ల కింది నుంచే ఉన్నట్టు తెలుస్తున్నది. వినుకొండ వల్లభుడి రచనగా చెప్పే 'క్రీడాభిరామం'లో గొబ్బెమ్మల ప్రస్తావన ఉన్నది. ఇది 14– 15 శతాబ్దాల సంధికాలంలో రాసిన కావ్యం. ఇందులో 1289– 1323 మధ్య పాలించిన కాకతీయ ప్రభువు ప్రతాపరుద్రుడి రోజుల్లోనే ఓరుగల్లులో ఇండ్ల ముందు గొబ్బెమ్మలను కొలువు దీర్చినట్టు ఇందులో పేర్కొన్నాడు. వీటిని 'గోమయ పిండములు' (ఆవు పేడతో చేసిన ముద్దలు)గా ప్రస్తావించాడు. పాల్కురికి సోమనాథుడు రాసిన 'పండితారాధ్య చరిత్ర'లో గొబ్బి పదాల ప్రస్తావన ఉన్నది. అప్పటికే ప్రజల నోళ్లలో ఉన్న గొబ్బి పదాలను 15వ శతాబ్దానికి చెందిన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు తన సంకీర్తనల్లో వాడుకున్నాడు. తిరుమల గిరుల్లో వెలసిన శ్రీవేంకటేశ్వరుడికి... బృందావనంలో యమునాతీరంలో విహరించిన శ్రీకృష్ణుడికి అభేదం చూపుతూ **'కొలని దోపరికి గొబ్బిళ్లో యదు/ కులము స్వామికిని గొబ్బిళ్లో'** అని నుతించాడు. బాలకృష్ణుని లీలా విశేషాలను చాటుతూ సాగే ఈ పాట అత్యంత ప్రసిద్ధి చెందిన అన్నమయ్య సంకీర్తనల్లో ఒకటి.



### చీరల దొంగే వస్త్ర ప్రదాత

'కొలని దోపరి' అంటే కొలనులో స్నానాలు చేయడానికి వచ్చిన గోపికల చీరలను ఎత్తుకెళ్లిన కృష్ణుడు అని అర్థం. మామూలు అర్థంలో చీరలు ఎత్తుకెళ్లిన అనే అర్థమే ఉన్నప్పటికీ... ఆధ్యాత్మికంగా దీనికి విశేషార్థం ఉంటుంది. మరో విశేషం ఏంటంటే కొలను దగ్గరి చీరల్ని దోచుకున్న కృష్ణుడు కౌరవ సభలో అవమానం పాలైన ద్రౌపదికి చీరలిచ్చి మానం కాపాడాడు. అలాంటి యదు– యాదవ కుల వల్లభుడికి గొబ్బిళ్లో అని అన్నమయ్య కీర్తన. గొబ్బిళ్లు అంటే రంగవల్లుల్లో కొలువుదీర్చే గొబ్బెమ్మలే అయినప్పటికీ.. నమస్కారం అనే అర్థం కూడా ఉన్నది. ఈ సంకీర్తనలో ప్రయోగించిన గొబ్బిళ్లు పదానికి నమస్కారం అనే అర్థాన్నే తీసుకోవాలి.

### గోవర్ధన గిరిధారి

ఇంద్రుడి ఆదేశంతో బృందావనంలో మేఘాలు రాళ్లవాన కురిపించి ఆగమాగం చేసినప్పుడు గోపజనులు, గోవులు, ఆవుదూడలు, ఇతర ప్రాణులను కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గొడుగుగా పట్టి కాపాడాడు. దీన్నే అన్నమయ్య **'కొండ గొడుగుగా గోవుల గాచిన/ కొండుక శిశువుకు గొబ్బిళ్లో'** అని ప్రస్తావించాడు. 'కొండుక' శిశువు అంటే చిన్న బిడ్డడు అని అర్థం. అంతేకాదు గోకులం, బృందావనంలో ఉన్నప్పుడు కంసుడి ఆదేశంతో ఎంతోమంది దైత్యులు (రాక్షసులు) చిన్నికృష్ణుడిని చంపడానికి ప్రయత్నించారు. పూతన, శకటాసురుడు, తృణావర్తుడు మొదలైనవాళ్లను దేవకీసుతుడు అణచివేశాడు. ఈ సందర్భాలను అన్నమయ్య **'దుండగంపు దైత్యుల కెల్లను తల/ గుండు గండనికి గొబ్బిళ్లో'** అని పేర్కొన్నాడు. దుండగాలకు తెగబడ్డ దైత్యులకు తలగుండు– బాధ మిగిల్చిన గండడు– శూరుడిగా కృష్ణుడిని పదకవితా పితామహుడు ప్రశంసించాడు. తల గుండు అంటే తలమీద పెట్టిన గుండు అని అర్థం.

### కంసుడు, శిశుపాలురకు కష్టాలు

శిశుపాలుడు చేది పాలకుడు. కృష్ణుడికి మేనత్త కొడుకు. కానీ నిరంతరం కృష్ణుడిని ద్వేషిస్తాడు. వంద తప్పుల వరకు కాచిన కన్నయ్య ఆ తర్వాత శిశుపాలుడిని సంహరిస్తాడు. ఇక మేనమామ కంసుడి సంగతి సరేసరి. **'పాప విధుల శిశుపాలుని తిట్ల/ కోపగానికిని గొబ్బిళ్లో'**– శిశుపాలుడు తనను తిట్టినందుకు కోపించిన వాడిగా కృష్ణుడికి అన్నమయ్య వందనాలు సమర్పించాడు. ఆ తర్వాత కంసుడిని చంపిన వైనాన్ని **'యేపున కంసుని యిడుమల బెట్టిన/ గోప బాలునికి గొబ్బిళ్లో'** అని కృష్ణుడి అవతార విశేషాన్ని ప్రస్తావించాడు. కంసుణ్ని ఒక్క సారిగా చంపకుండా కృష్ణుడు తాను ఎక్కడున్నది తెలియకుండా వేచి ఉండేలా కష్టపెట్టి మరీ చంపేశాడు. యిడుములు (ఇడుములు) అంటే కష్టాలు అని అర్థం.

“
కొలని దోపరికి గొబ్బిళ్లో యదు
కులము స్వామికిని గొబ్బిళ్లో

కొండ గొడుగుగా గోవుల గాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్లో
దుండగంపు దైత్యులకెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్లో

పాప విధుల శిశుపాలుని తిట్ల
కోపగానికిని గొబ్బిళ్లో
యేపున గంసుని యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్లో

దండివైరులను తరిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్లో
వెండి పైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్లో
”

### వెండి బంగారాల వేంకటగిరి


దేవతలు అద్భుతమైన శక్తులు కలిగిన వాళ్లు. వారిని తరిమివేసిన ఘనులు రాక్షసులు. అంతటి పరాక్రమం కలిగిన రాక్షసులను విష్ణువు వివిధ అవతారాలు ధరించి అంతం చేశాడు. దీన్నే అన్నమయ్య **'దండి వైరులను తరిమిన దనుజుల/ గుండె దిగులునకు గొబ్బిళ్లో'** అని ప్రయోగించాడు. 'దండి వైరులు' అంటే దేవతలు. దనుజులు అంటే రాక్షసులు. వారి గుండెల్లో దిగులు– భయం, దడ పుట్టించినవాడు శ్రీమహావిష్ణువు. ఆపన్నులను రక్షించే శ్రీమహావిష్ణువు తిరుమల గిరుల్లో శ్రీవేంకటేశ్వరుడి రూపంలో కొలువుదీరి భక్తులకు కొంగుబంగారంగా నిలిచాడు. దీన్నే 'వెండిపైడి యగు వేంకటగిరిపై/ కొండలయ్యకును గొబ్బిళ్లో' అని అన్నమయ్య కొలిచాడు. స్వామిని నమ్ముకున్న వారికి వేంకటగిరి (తిరుమల) వెండి, బంగారాలతో సమానం. అక్కడ వెలసిన కొండలయ్య (వేంకటేశ్వరుడు)కు గొబ్బిళ్లు అంటున్నాడు అన్నమయ్య. అలతి అలతి పదాలతో అచ్చ తెలుగు ఆచారానికి చక్కటి పాటలో పట్టం కట్టిన అన్నమయ్యకు గొబ్బిళ్లు!

... చింతలపల్లి హర్షవర్ధన్

# గులాబీ ముళ్లు

కథాసుధ


**సాఫ్ట్‌వేర్** ఉద్యోగం చేసే ఓ అమ్మాయికి మంచి పెళ్లి సంబంధం వచ్చింది. అన్ని విధాలా అనుకూలంగా ఉన్న ఆ సంబంధాన్ని కాదనవద్దని తల్లి ప్రాధేయపడింది. తనకన్నా మూడేండ్లు పెద్దవాడని, అంత వయసు తేడా ఉన్న అబ్బాయి తనకు వద్దని అమ్మాయి ఆ సంబంధం తిరస్కరించింది. 'నాకూ, మీ నాన్నకూ ఆరేండ్ల తేడా ఉంది, మేము బాగానే ఉన్నాం కదా?' అని గట్టిగా నిలదీసింది తల్లి. 'మీరు చేసుకున్నారని, నేను చేసుకోవాలా... వద్దంటే వద్దు. వయసు తేడా ఉంటే రుచులు, అభిరుచులు, అభిప్రాయాలు, ఆలోచనలు కలవవు. కాబట్టి నేను చేసుకోను' అని భీష్మించుకుని కూర్చుంది ఆ అమ్మాయి. ఇంతలో వారి ఇంటికి ఆ అమ్మాయి చిన్ననాటి స్నేహితురాలు వచ్చింది. ఆమె మానసిక వైద్యురాలు. స్నేహితురాలి చేతిలో పెండ్లి పత్రిక ఉంచి తన వివాహానికి తప్పకుండా రావాలని ఆహ్వానించింది. ఆ మాటా ఈ మాటా తర్వాత 'పెండ్లి



కొడుక్కీ, నీకు ఎన్ని నెలల తేడా' అని అడిగింది సాఫ్ట్‌వేర్ అమ్మాయి. 'నాలుగేండ్లు' అని బదులిచ్చింది వైద్యురాలు. 'అంత వయసు తేడా ఉన్న సంబంధం ఎందుకు ఒప్పుకొన్నావు? మనకన్నా ఎక్కువ వయసువారైతే వారు మన మీద అధికారం, అజమాయిషీ చెలాయించరా?' అని ఎదురు ప్రశ్న వేసింది. వైద్యురాలు నవ్వుతూ 'అలా ఎందుకనుకోవాలి? మనకన్నా ముందు ఈ భూలోకంలోకి వచ్చి, అంతా బాగుందని తెలుసుకుని మనల్ని ఈ నేలమీదికి ఆహ్వానించినవారని ఎందుకు అనుకోకూడదు?' అని నవ్వుతూ సమాధానమిచ్చింది. 'నిజమే కదా... అలా ఎందుకు అనుకోకూడదు?' అని కొన్ని క్షణాలు ఆలోచనల్లో పడింది సాఫ్ట్‌వేర్ అమ్మాయి. చిన్నగా తల్లి వైపు తిరిగి, వచ్చిన సంబంధం కుదుర్చుకుందాం అన్నట్టుగా కళ్లతోనే సైగ చేసింది. విప్పారిన ముఖంతో ఆ తల్లి 'గులాబీ తోటలోకి వెళ్లిన కొందరు పూల అందం చూస్తారు. మరికొందరు గులాబీ ముళ్లను చూస్తారు. పూలు కోసేటప్పుడు ఆ ముళ్లు గుచ్చుకుంటాయేమోనని భయపడతారు. ఆ ఆందోళనలో గులాబీల అందాన్ని ఆస్వాదించడం మరచిపోతారు. అయినా గులాబీల అందం ముందు, ముళ్ల బాధ ఎంత? గులాబీ ముళ్లలాంటి చిన్న సమస్యలను కూడా భూతద్దంలో చూస్తే ఎలా? జీవితం కూడా అంతే' అని మనసులో అనుకుంది.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు, 93936 62821

# జ్ఞానానికి ద్వారం హజ్రత్ అలీ





**ముహమ్మద్** ప్రవక్త (స) నలుగురు సహచరుల్లో హజ్రత్ అలీ (రజి) చివరివారు. ప్రవక్త (స)కు స్వయానా అల్లుడు. ఇమామ్ హుసైన్ (రజి) తండ్రి. హజ్రత్ అలీ (రజి) ఇస్లామీయ ప్రపంచంలో ఎంతో పేరుప్రఖ్యాతులు గడించారు. ఆయన నమాజులు, రోజాలు పాటించడంలో ఏ చిన్నపాటి నిర్లక్ష్యమూ వహించేవారు కాదు. ఒకసారి ఓ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) శరీరానికి మూడు బాణాలు గుచ్చుకున్నాయి. హజ్రత్ అలీ (రజి)ని చెట్టుకు కట్టేసి బాణాలు తొలగిద్దామని వైద్యుడు చెప్పాడు. దానికి హజ్రత్ అలీ ఒప్పుకోలేదు. మరి బాణాలు తీసే క్రమంలో నొప్పి భరించలేనంతగా ఉంటుంది కదా అని వైద్యులు చెప్పారు. అయితే 'నేను నమాజులో లీనమైనప్పుడు బాణాలు తొలగించండి' అన్నారు. అంటే ఆయన నమాజు చేస్తున్నప్పుడు ఎంతగా దైవారాధనలో నిమగ్నమవుతారో అర్థం చేసుకోవచ్చు. హజ్రత్ అలీ ఖురాన్ పాండిత్యంలో ఎంతో సుప్రసిద్ధులు. బద్ధ విరోధులు సైతం ఆయన దగ్గరికి ధర్మ సందేహాల నివృత్తి కోసం వచ్చేవారు. జీవితాంతం ఎంతో నిజాయతీగా జీవితాన్ని గడిపారు. ఆయన్ను చూడటానికి దైవదూతలు దిగి వస్తారు అని ప్రవక్త (స) చెప్పేవారు. ఒకానొకసారి హజ్రత్ అలీ (రజి) తన విరోధితో కలబడుతున్నారు. శత్రువును నేలకూల్చారు. ఒకే ఒక్క వేటుతో శత్రువును మట్టికరిపించే అవకాశం హజ్రత్ అలీ (రజి)కి చిక్కింది. ఆ సమయంలో శత్రువు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో హజ్రత్ అలీ(రజి) మీద కాండ్రించి ఉమ్మివేశాడు. దీంతో హజ్రత్ అలీ (రజి) తన చేతిలో ఖడ్గాన్ని పక్కన పడేసి అతణ్ని మరుక్షణమే వదిలేశారు. ఒక్కసారిగా ఆ శత్రువు ఖంగుతిన్నాడు. 'నన్ను చంపే అవకాశమున్నా వదిలేశావెందుకు?' అని అడిగాడు. దానికి అలీ 'నేను ఇప్పటిదాకా ధర్మం కోసమే నీతో పోరాడాను. ఎప్పుడైతే నువ్వు నా మీద ఉమ్మివేశావో అప్పుడు నాలో వ్యక్తిగత కోపం రగిలింది. ఒకవేళ నిన్ను చంపినట్లయితే నా వ్యక్తిగత ప్రతీకారంతో చంపినట్లవుతుంది. అందుకే నిన్ను వదిలేశాను' అని జవాబిచ్చారు. ఆ మాటలు అతనిలో పరివర్తన తీసుకొచ్చాయి. మరుక్షణమే హజ్రత్ అలీ (రజి) అనుచరుడిగా మారిపోయాడు.

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

# మనసే మూల కారణం

**మనోహి ద్వివిధం ప్రోక్తం, శుద్ధం చాఽశుద్ధమేవ చ।**
**అశుద్ధం కామ సంకల్పం, శుద్ధం కామ వివర్జితమ్॥**
(అమృతబిందు ఉపనిషత్తు)

**మనసు** శుద్ధమని, అశుద్ధమని రెండు విధాలు. కామ సంకల్పం (కోరిక) కలిగిన మనసు అశుద్ధం. కామ వికారం లేని మనసు శుద్ధమైనది' అని పై శ్లోక అర్థం. రామకృష్ణ పరమహంస చెప్పిన ఓ కథ ఈ ఉపనిషత్ వాక్యానికి భాష్యంగా కనిపిస్తుంది. ప్రియనాథ ముఖర్జీ అనే ఇంజినీరు సంసారంలో బందీ అయిపోయానని విచారిస్తూ ఉంటే పరమహంస ఈ కథ చెప్పారు. 'ఇద్దరు మిత్రులు దారిలో వెళుతుండగా ఒకచోట భాగవత పురాణ కాలక్షేపం జరుగుతున్నది. వారిలో ఒకడు 'మిత్రమా! కాసేపు పురాణం విని పోదాం రా!' అని లోపలికి వెళ్లి వినసాగాడు. రెండోవాడు మాత్రం లోపలికి ఓసారి తొంగిచూసి వెళ్లిపోయాడు. వాడు నేరుగా ఒక వ్యభిచార గృహం చేరుకున్నాడు. ఐతే చాలాసేపు అక్కడ ఉండలేక పోయాడు. ఆ పరిసరాలు, వెకిలి చేష్టలు అతనికి రోత పుట్టించాయి. 'ఛీ!ఛీ! నా స్నేహితుడు పవిత్రమైన హరి నామాన్ని వింటూ సత్కాలక్షేపం చేస్తుంటే, నేనిలా తయారయ్యాను' అని పశ్చాత్తాపం చెందాడు. పురాణం వినడానికి వెళ్లిన వాడు కాసేపటికే విసుగు చెందాడు. 'నేనెంత తెలివిమాలిన వాణ్ని. వీడి వాగుడు వింటూ కూర్చున్నాను. నా మిత్రుడేమో స్వర్గ సుఖాలలో తేలిపోతూ ఉన్నాడు' అని వాపోయాడు. కొన్నాళ్లకు వాళ్లిద్దరూ మరణించారు. యమభటులు భాగవతం విన్నవాడి జీవుణ్ని నరకానికి తీసుకుపోయారు. వ్యభిచార గృహానికి వెళ్లినవాడి జీవుణ్ని విష్ణుదూతలు వైకుంఠానికి తీసుకుపోయారు. పరమహంస ఈ కథ చెప్పి 'అన్నిటికీ ప్రధానమైనది మనస్సే. బంధించేది అదే! విముక్తి కలిగించేది అదే! బందీ అయ్యేదీ, ముక్తి పొందేదీ మనసే! భగవంతుడు మానవుడిలో చూసేది మనసును మాత్రమే గాని, అతడు ఏమి చేశాడన్నది, ఎక్కడ ఉన్నాడన్నది పట్టించుకోడు' అని వివరించారు.




**మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధ మోక్షయోః।**
**బన్ధాయ విషయాసక్తం, ముక్త్యా నిర్విషయం స్మృతమ్॥**
'మనుషుల బంధ మోక్షాలకు కారణం మనసే.
విషయాలపై ఆసక్తి కలిగిన మనసు బంధం కలిగిస్తుంది. ఆసక్తి లేని మనసు మోక్షాన్ని ప్రసాదిస్తుంది' అంటుంది మరో ఉపనిషత్ వాక్యం.

... డా|| వెలుదండ సత్యనారాయణ